ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
ఆదివారం 14 జనవరి 2024



7 ఆలయ పరిసరాల్లో భక్తిభావాన్ని పెంపొందించాలి
8 కన్నుల పండువగా గోదాదేవి కల్యాణం



పల్లెల్లో సంక్రాంతి శోభ

- గ్రామాలకు చేరుకుంటున్న పట్నం వాసులు
- వేడుకలకు సిద్ధమవుతున్న అన్నదాతలు
- రంగుల కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి
- నేడు భోగి, రేపు సంక్రాంతి, ఎల్లుండి కనుమ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

తెలుగు పండుగల్లో సంక్రాంతికి ప్రత్యేకత ఉంది. ముఖ్యంగా పల్లెల్లో సందడి కనిపిస్తుంది. మూడు రోజుల పండుగ సంబరంగా సాగుతుంది. సంక్రాంతికి ఒక్క రోజు ముందొచ్చేది భోగి. భోగి అనగానే గుర్తుకొచ్చేది భోగి మంటలు. గొబ్బి దేవతకు స్వాగతం పలుకుతూ పల్లె పడుచులు గొబ్బి పాటలు, భోగి మంటలతో నిండైన సంక్రాంతిని ఘనంగా జరుపుకుంటారు. ఈ సారి శుక్రవారం నుంచే సెలవులు ఉండడంతో వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు కూడా పల్లెలకు చేరుకుంటుండడంతో సందడి నెలకొంది. కొత్త అల్లుళ్లు, ఉద్యోగాల కోసం పట్టణాలకు వెళ్లిన కొడుకులు, కూతుళ్లు గ్రామాల్లోకి చేరుకు న్నారు. ఉత్తరాయన పుణ్య కాలంలో మార్గశిర పుష్య మాసాలలో సంక్రాంతి వస్తుంది. సూర్యుడు ఒక్కొక్క మాసంలో ఒక్కొక్క రాశిలోకి వస్తూ మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. అలా సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రమణం లేదా మకర సంక్రాంతిగా చెప్పుకుంటారు. ఈ సంక్రాంతి సంబరాలను జరుపుకోవడానికి పల్లెలకు జనం తరలిరావడంతో అప్పుడే సందడి నెలకొంది. ఆదివారం భోగి సోమవారం సంక్రాంతి మంగళవారం కనుమ జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పండుగ ఎన్నో సంప్రదాయాలతో ముడిపడి ఉంది. డూడూ బసవన్నలు, వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఆధునిక పోకడలతో పండుగలో కొన్ని కళలు తగ్గినా రంగవల్లులు తీర్చిదిద్దడంలో మహిళలు మాత్రం పోటీ పడుతూనే ఉన్నారు. పంట దిగు బడి ఇంటికి వచ్చే వేళ అన్నదాతల సంబరం, ఆత్మీయు లందరూ ఇళ్లకు చేరుకోవడంతో వంటివాటితో ఇంటింటా ఆనందోత్సాహాలను నింపుతుంది. సంక్రాంతి రోజు చిన్నా రులు పతంగులతో ఆడుకుంటారు. భోగి మంటలు, సంక్రాంతి, వ్యవసాయానికి ఎంతోగానో సహకరించిన పశువులకు కృతజ్ఞతగా కనుమను జరుపుకుంటారు. సంక్రాంతి సంబరాల్లో ముఖ్యంగా గొబ్బెమ్మలు ముఖ్యమైనవి. ఆవుపేడతో ముద్దలు చేసి ముగ్గుల మధ్యన పెట్టి పసుపు, కుంకుమ అద్ది పిండితో ముగ్గులు వేస్తారు. గొబ్బెమ్మ చుట్టు చామంతి, బంతి, బీర, గుమ్మడి పూలతో అలంకరిస్తారు. ఈ గొబ్బెమ్మను గౌరి దేవిగా భావిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో ఆట పాటలతో సంబరాలు జరుపుకుంటారు. పసుపు కుంకుమలతోపాటు పెసరపప్పు, శనిగలు, మరమరాలు(పెలాల), అటుకులు మొదలైన వాటితో పూజలు చేసి పంచుకుంటారు. పల్లెల్లో గొబ్బెమ్మలకు పేడ దొరుకుతున్న పట్టణాల్లో కష్టమే కాబట్టి రైతులు పేడను మార్కెట్‌లోకి తీసుకొచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. కిలో ఆవుపేడ 50రూపాయల వరకు ధర పలుకుతోంది. గరక, గడ్డిపూలకు కూడా గిరాకీ ఉంది. ముగ్గుల రంగుల కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి నెలకొంది.

● పిల్లలకు భోగిపండ్ల స్నానం

భోగి పండ్లు అంటే రేగు పండ్లు. సూర్యుడి రూపం రంగు పేరు కలిగిన రేగుపండ్లతో నాణేలు కలిపి పిల్లల నెత్తిపై పోసి ఆశీర్వదిస్తారు. పిల్లలు కూడా ఎంతో సంబరంగా వేడుకల్లో పాల్గొంటారు. సాయంత్రం వేళ మహిళలు బొమ్మల కొలువులు నిర్వహిస్తారు. మన సంస్కృతీసంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా బొమ్మల కొలువులు ఉంటాయి.

● వివిధ రాష్ట్రాల్లో సంక్రాంతి

సంక్రాంతి సంబరాలను వివిధ రాష్ట్రాల్లోనూ ఆనందోత్సహాల మధ్య జరుపుకుంటారు. తమిళనాడులో భోగి రోజు నుంచి తమిళులకు నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ రోజున పాలు, కొత్త బియ్యం, బెల్లంతో కొత్త కుండలో పొంగల్ చేసుకుంటారు. వ్యవసాయంలో సేవలందించినందుకు పశువులకు కృతజ్ఞతలు తెలుపుకోవడం, స్నేహితులు బంధువులతో ఆనందంగా గడుపుతారు. మహారాష్ట్రలో ఇళ్లలో విందులు ఏర్పాటు చేసుకొని బంధువులను, స్నేహితులను పిలుచుకుంటారు. మహిళలు వస్త్ర దానం చేస్తారు. గోవాలో కూడా వస్త్ర దానం చేసే పద్ధతి కొనసాగుతోంది. గుజరాత్‌లో మకర సంక్రాంతి రోజున ఉత్తరాయనంగా, మరుసటి రోజున వాసి ఉత్తరాయనంగా జరుపుకుంటారు. ముఖ్యంగా గాలిపటాలను ఎగరవేయడం ఇక్కడి సంప్రదాయం. పంజాబ్‌లో లోది, లోహ్రి పేరుతో సంక్రాంతి జరుపుకుంటారు. స్వీట్లు, చెరకు, బియ్యం, మొదలై వస్తువులను భోగి మంటల్లో వేస్తారు.

● నేడు భోగి సంబరాలు



సంక్రాంతిని పెద్ద పండుగగా పిలుస్తారు. అలాంటి సంక్రాంతి మొదటిది భోగి, ధనుర్మాసం చివరి రోజు మనలోని చెడు గుణాలను తొలగించుకొని పవిత్రమైన జీవితం గడపాలనే నేపథ్యంలో అందరూ భోగి మంటలు వేస్తారు. తెల్లవారు జామునే ఇళ్లలో ఉన్న పాత వస్తువులను కుప్పగా పోసి భోగిమంటలు వేస్తారు. పాత అలవాట్లకు స్వస్తి పలికి కొత్త దనాన్ని , కొత్త ఆలోచనలు కోరుకొంటూ భోగితో సంక్రాంతిని స్వాగతిస్తారు. ప్రతీ ఇంటి ముందు భోగిమంటలు వేసి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. పల్లెల్లో భోగి మంటల సంప్రదాయం ఇంకా ఉన్నా పట్టణాల్లో మాత్రం కనుమరుగైపోయింది. భోగి మంటల చుట్టూ తిరుగుతూ భోగి మంటలతో కాగిన నీళ్లతో స్నానం చేస్తారు. ఈ స్నానాలతో దుష్టశక్తులు తొలగిపోయి సంతోషంగా ఉంటారని భావిస్తారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక చేయూత

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
- ముందుకొస్తున్న దాతలు

కోనరావుపేట, జనవరి 13: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎనిమిదేళ్ల బాలుడి వైద్యానికి ఆర్థిక చేయూతనందించేందుకు దాతలు ముందుకొస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పులిసె చందు, పల్లవి దంపతుల ఎనిమిదేళ్ల కొడుకు నిహాల్ లివర్ సమస్యతో బాధపడుతుండగా హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. లివర్ మార్పిడి చేయాలని, ఇందుకు రూ.44 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. అంత డబ్బు లేకపోవడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. బాలుడి దీన స్థితిపై 'మా బాబును ఆదుకోరూ' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో ఈ నెల 8న వచ్చిన కథనానికి స్పందించి దాతలు ముందుకొస్తున్నారు. దాతలు ఆర్థికసాయం అందిస్తున్నారని, మరి కొంతమంది ముందుకు వచ్చి ఆదుకోవాలని తమకొడుకును కాపాడాలని వేడుకుంటున్నారు. దాతలు 9000602038 నంబరులో సంప్రదించాలని కోరుతున్నారు.

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పోటీలను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జనవరి 13 : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం చింతలఠాణ, చీర్లవంచలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఆధ్వర్యంలో కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటిసారి గ్రామానికి వచ్చిన తనకు గ్రామస్థులు ఘనస్వాగతం పలుకడం సంతోషంగా ఉందన్నారు. నిర్వాసితుల సమస్య లపై స్పష్టమైన అవగాహన ఉందని, తప్పకుండా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ముంపు గ్రామాల సమస్యలు తనతోపాటు ప్రభుత్వంలోని పెద్దలకు తెలుసన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండు హామీలను ఇప్పటికే అమలు చేశామన్నారు. సర్పంచ్ ఇటీక్యాల నవీణరాజు, చింతపల్లి శ్రీనివాస్ రావు, ఇటిక్యాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

● రుద్రవరంలో నిర్వహించిన తెప్పెల పోటీలు ఆంధ్రాలో సంక్రాంతి పందెం కోళ్ల ఆటను తలపించేలా ఉన్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం రుద్రవరంలో ముదిరాజ్ మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో రాజరాజేశ్వరీ జలాశయంలో తెప్పెల పోటీలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్రాంతి పండగా అంటేనే ఆంధ్ర పల్లెటూర్‌లో కొడిపందేలు, ఎద్దుల పోటీలు గుర్తుకు వస్తాయని, వాటిని మరిపించేలా తెప్పెల పోటీల ను నిర్వహించడంఅభినందనీయమని అన్నారు. తెప్పెల పోటీలను ఇతర రాష్ట్రాల్లో చూస్తుంటామని, మన జిల్లాలో మన మండలంలో ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. మత్స్యకారుల అభ్యు న్నతికి ప్రభత్వం కృషి చేస్తోందని, వచ్చే సంవత్సరం తెప్పెల పోటీలను అందరం కలిసి జిల్లా వ్యాప్తంగా నిర్వహించుకుందామని అన్నారు. సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, సింగిల్ విండో ఛైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు, కత్తి కనుకయ్య, తునికి నరేష్, తునికి శ్రీకాంత్ ఉన్నారు.

కాంగ్రెస్‌వి ఆచరణకు సాధ్యం కాని హామీలు

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్ - బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

ఇల్లంతకుంట, జనవరి 13: ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఇల్లంతకుంటలో శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, నెరవేర్చకపోతే ప్రజల ద్వారా తిరుగుబాటు తప్పదని అన్నారు. రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టుల సామర్థ్యం పెంచడంతోనే అంచనా వ్యయం పెరిగిందన్నారు. ఎంపీలుగా పనిచేసిన పొన్నం ప్రభాకర్, బండి సంజయ్‌కుమార్ ఏనాడూ జిల్లా అభివృద్ధికి పాటుపడలేదన్నారు. గతంలో 7,778 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యేదని, నేడు 26వేల మెగావాట్లకు పెరిగిందని గుర్తు చేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, రాబోయే ఎంపీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ప్రజల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిపై వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీవైస్ ఛైర్మన్ సిద్దం వేణు, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, ఏఎంసీ ఛైర్మన్ సంజీవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, నాయకులు రాజిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- కోడె మొక్కు చెల్లించుకున్న భక్తులు - స్వామివారి సేవలో ప్రముఖులు





కమిషనర్‌కు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఈవో, కోడెమొక్కు చెల్లించుకుంటున్న సీఐడీ ఎస్పీ

వేములవాడ టౌన్, జనవరి 13 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులు కోడెమొక్కు చెల్లించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. పలువురు ప్రముఖులు శనివారం రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దేవాదాయ కమిషనర్ అనిల్‌కుమార్‌కు ఆలయాధికారులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. సీఐడీ ఎస్పీ రాంరెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ లింబాద్రి దంపతులు, శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ మల్లేశం రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయాధికారులు ప్రసాదాన్ని అందజేశారు.

ఆకట్టుకున్న తెప్పల పోటీలు





రుద్రవరం బ్యాక్ వాటర్‌లో తెప్పల పోటీల్లో పాల్గొన్న మత్స్యకారులు

వేములవాడ టౌన్, జనవరి 13: వేములవాడ మండలం రుద్రవరంలో ముదిరాజ్ మత్స్యశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తెప్పల పోటీలు ఆకట్టుకున్నాయి. గ్రామంలోని మిడ్‌మానేరు జలాశయంలో సందడి వాతవరణం నెలకొంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కేరింతలతో ఉత్సాహపరిచారు. ఏటా సంక్రాంతి పండగకు ఆంధ్రాలో కోళ్ల పందేలు, ఎడ్ల బండ్ల పందేలా మాదిరిగా తెప్పల పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో సీనియర్ బ్యాచ్‌లో తునికి నరేష్ మొదటి స్థానంలో, తునిక బాలరాజు ద్వితీయ, జూనియర్ విభాగంలో మొదటి స్థానంలో తునికి రఘు, ద్వితీయ స్థానంలో తునిక రామచంద్రం, తృతీయ స్థానంలో తునికి రాజు నిలిచినట్లు ముదిరాజ్ మత్స్యశాఖ అధ్యక్షుడు తునికి శ్రీకాంత్ తెలిపారు.

● తెప్పల పోటీల్లో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెప్పపై పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. దీంతో క్రీడాకారులు మరింత ఉత్సాహంతో పోటీల్లో పాల్గొన్నారు.

16న పరిశ్రమలు ప్రారంభం

- టెక్స్‌టైల్ పార్కు యజమానుల సంఘం తీర్మానం

తంగళ్లపల్లి, జనవరి 13:తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలను ఈ నెల 16వ తేదీన తెరచుకోనున్నాయి. శనివారం సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు క్లాత్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యజమానులు సమావేశం నిర్వహించారు. పరిశ్రమలు నడపడానికి తీర్మానించినట్లు అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్వీఎం ఆర్డర్ ప్రభుత్వం ఇవ్వడంతో తిరిగి పరిశ్రమలు తెరుస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, డైరెక్టర్ అలుగు వర్షిణికి టెక్స్‌టైల్ పార్కు యజమానుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అంకారపు కిరణ్, దుబాల మొండయ్య, యెల్లె లక్ష్మీనారాయణ, బొద్దుల వేణుప్రసాద్, గాలిపల్లి నారాయణ, ఆడెపు సూర్య, ఆడెపు శోభన్, గాజుల శరత్‌కుమార్, దూస దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సెస్ ఛైర్మన్ చిక్కాల రామరావు

తంగళ్లపల్లి, జనవరి 13 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఎంపీటీసీ కోడి అంతయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీపీఎల్ సీజన్ 3 క్రికెట్ టోర్నీని సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ పడిగెల మానసలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పడిగెల రాజు, రాపెల్లి ఆనందం, యూత్ నాయకులు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక సమస్యలపై అవగాహన పెంచుకోవాలి

ఇల్లంతకుంట, జనవరి 13: విద్యార్థులు సామాజిక సమస్యలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఆకునూరి శంకరయ్య అన్నారు. మండలంలోని జంగమరెడ్డిపల్లెలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శ్రమదానం చేపట్టడం, ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించడం మంచి పరిణామం అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంపత్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి కుమారస్వామి, యాదగిరి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: రజతోత్సవ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి యాజమాన్యం విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాల్సిన స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు కార్యక్రమానికి హాజరవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో తల్లిదండ్రుల పక్షాన ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

సీఎం పీఆర్వోకు సన్మానం



శ్రీనివాస్‌తో టీఎన్జీవో నాయకులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీఆర్వోగా నియామకమైన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన బొల్గం శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో టీఎన్జీవో నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు శనివారం సన్మానించారు. టీఎన్జీవో అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్యాక్స్ వైస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, నాయకులు రమేశ్, రవి, పర్శరాంరెడ్డి, స్వామి, ప్రభాకర్‌రెడ్డి, షకీల్ ఉన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

బోయినపల్లి, జనవరి 13: మండల కేంద్రంలో శనివారం పుల్లూరి అంజనేయులు (45) ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన అంజనేయులు సిరిసిల్లలో మరమగ్గాల కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 11 గురువారం ఇంట్లో నుంచి వెళ్లిన అంజనేయులు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించగా ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. అంజనేయులు భార్య లలిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు.

బావిలోకి దూసుకెళ్లిన కారు : ఒకరు మృతి

పెద్దపల్లి రూరల్, జనవరి 13: పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లి గ్రామ శివారులో శనివారం ఉదయం 2 గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు కారు బావిలో పడి ఒకరు మృతిచెందగా, ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నిమ్మనపల్లి గ్రామం నుంచి పెద్దకల్వలకు వెళ్తున్న కారు అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లిందన్నారు. ఈ ప్రమాదంలో రంగంపల్లికి చెందిన వినిత్‌రెడ్డి(27) మృతి చెందగా, కారులో ఉన్న గాదె అఖిల్, అల్లం బాల అనురోహిత్‌రెడ్డి, సాయిలు బావి పైప్ ద్వారా బయటికి వచ్చి క్షేమంగా బయటపడినట్లు తెలిపారు. పెద్దపల్లి ఎస్ఐ 2 మల్లేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ గుజరాత్‌వాసి మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ఎల్లారెడ్డిపేట మండల శివారులోని ఈ నెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుజరాత్‌కు చెందిన కులదీప్ కుమార్(28) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గుజరాత్‌కు చెందిన కులదీప్‌కుమార్ ఓ బీడీ కంపెనీలో పనులు చేస్తుండేవాడన్నారు. ఈ నెల 10న గంభీరావుపేటకు చెందిన కిషోర్‌తో కులదీప్‌కుమార్ ద్విచక్ర వాహనంపై గంభీరావుపేట నుంచి ఎల్లారెడ్డిపేట వైపునకు వస్తుండగా గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద యూ టర్న్ తీసుకుంటున్న క్రమంలో గొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టిందన్నారు. దీంతో కులదీప్‌కుమార్, కిషోర్ తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. కులదీప్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో మొదట సిరిసిల్లకు తరలించారని, అక్కడ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారన్నారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ కులదీప్‌కుమార్ శనివారం మృతి చెందాడన్నారు.

వెంకటయ్యపల్లిలో..

గంగాధర: గంగాధర మండలం వెంకటయ్యపల్లికి చెందిన రావుల లచ్చగౌడ్(58) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. లచ్చగౌడ్ గతేడాది డిసెంబరు 26న ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు వెళ్లి గ్రామానికి తిరిగి వస్తుండగా కురి క్యాల శివారులో నిలిపివేసిన లారీని వెనక నుంచి ఢీకొట్టాడన్నారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడన్నారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు.

మద్యం మానుకోవాలన్నందుకు ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో మద్యం మానుకోవాలని మందలించినందుకు రంగు దేవయ్య(49) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాణాకు చెందిన దేవయ్య నాలుగేళ్ల కిందట భార్య పిల్లలతో కలిసి ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు వలస వచ్చాడు. ఓ ఇంటిని అద్దెకు తీసుకొని జీవిస్తున్నాడు. స్థానికంగా మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుండేవాడు. పంట దిగుబడి తగ్గడంతోపాటు కుటుంబ పోషణకు సుమారు రూ.2 లక్షలు అప్పు చేశాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసయ్యాడు. తరుచూ ఇంట్లో భార్యాభర్తల మధ్య గొడవలు చోటు చేసుకుంటుండేవి. మూడు రోజుల కిందట గొడవ జరగగా, ఇంటి ఎదురుగా ఉన్న నారాయణ మందలించడంతో ఆయనపై దాడికి దిగాడు. రోజూ తాగొచ్చి గొడవపడుతున్నావంటూ తాగుడు మానుకోవాలంటూ భార్య బాలవ్వ దేవయ్య మధ్య శుక్రవారం రాత్రి వాగ్వాదం చోటుచేకుంది. శనివారం ఉదయం లేచి చూసే సరికి దేవయ్య ఇంట్లోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దకల్వలలో..

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దకల్వలకు చెందిన నర్ల పోచాలు (58) మద్యానికి బానిసై మానసిక వేదనతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ2 మల్లేష్ తెలిపారు.

భవనం పైనుంచి పడి మధ్యప్రదేశ్ కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం, జనవరి13: భవన నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో పైనుంచి పడి మధ్యప్రదేశ్ రాష్ట్రం బాల్‌గాటు జిల్లాకు చెందిన లకనో కోహెర్ (34)మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన లకనో కోహెర్ కుటుంబం ఏడాది కిందట కరీంనగర్‌కు వచ్చి కొత్తపల్లిలోని ఒక భవన నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నారన్నారు. శనివారం భవనంలోని నాలుగో అంతస్థులో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయని, ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతిచెందాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం


సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్న, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రుయా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో.. మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటుకున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సులో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గి స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాంగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలిపటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.


ఆలయ ఆవరణలో భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, జనవరి 13: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది.

సిర్పూర్ ఎమ్మెల్యే పూజలు


అంజన్న సన్నిధిలో ఎమ్మెల్యే హరీ‌ష్‌బాబు

సిర్పూర్-కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు శనివారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అధికారులు సత్కరించారు. అలాగే ఖమ్మం అడిషనల్ న్యాయమూర్తి గుర్రం శ్రీనివాస్ కూడా అంజన్నను దర్శించుకున్నారు

క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయి

జగిత్యాల అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్‌రావు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ ఎస్పీ

కొడిమ్యాల, జనవరి 13: క్రీడలు క్రీడాకారుల్లో దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఆర్ ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని నమిళికొండ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వాలీబాల్ సీనియర్ క్రీడాకారుల స్మారకార్థం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో నమిళికొండ పోలీస్ బృందం వారు నిర్వహిస్తున్న వాలీబాల్ ఆటల పోటీలను అడిషనల్ ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ప్రతీ వ్యక్తిలో మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. నమిళికొండ గ్రామం నుంచి పలువురు పోలీస్ ఉద్యోగాలు చేస్తు సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల స్మారకార్థం ఆటల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు(ఏఆర్), జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి, సీఎస్ఎస్ సీఐ వేంకటేశ్వర్‌రావు, కొడిమ్యాల ఎస్సై కె వెంకట్‌రావు, జడ్పీటీసీ ప్రశాంతి, ఎంఈవో శ్రీనివాస్, సర్పంచు అనితనరేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నాయకులు జి. లక్ష్మణ్, ఎం క్రిష్ణారెడ్డి, సీహెచ్ సుధీర్‌రావు, రాంచందర్‌రావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రఘుపతిరెడ్డి, ఫుడ్ స్పాన్సర్లు లక్ష్మీరాజం, ఇ.శ్రీనివాస్, స్పోర్ట్స్ కిట్ స్పాన్సర్ ఎన్. శ్రీనివాస్, షాబొద్దీన్, టోర్నమెంట్ నిర్వహిస్తున్న నమిళికొండ పోలీస్ బృందం పాల్గొన్నారు. ఈ క్రీడల్లో 42 జట్లు పాల్గొన్నట్లు నిర్వహకులు తెలిపారు.

రాజన్న ఆలయ పరిసరాల్లో

భక్తిభావాన్ని పెంపొందించాలి..

- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- త్వరలో సీఎంతో సమీక్షకు కసరత్తు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నరసింహుడి ధ్వజ స్తంభం వద్ద మొక్కుతున్న దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్

వేములవాడ టౌన్, జనవరి 13 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో భక్తిభావం పెంపొందేలా చూడాలని, ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ అధికారులకు సూచించారు. వేములవాడ ఆలయంలోని చైర్మన్ చాంబర్‌లో దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రాజన్న ఆలయానికి వచ్చేది పేద, మధ్యతరగతి భక్తులేనని, వారికి కావాల్సిన వసతి సౌకర్యాలను మెరుగు పర్చాలని అన్నారు. దర్శనం సులువుగా అయ్యేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రోటోకాల్ బ్రేక్ దర్శనాలకు కొత్త నివేదిక తయారు చేయాలన్నారు. వసతి గదుల్లోనూ భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. సామాన్య భక్తులు విడిది చేసేందుకు మాస్టర్ ప్లాన్‌కు ఆటంకం కలుగకుండా షెడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. కరీంనగర్‌లోని కల్యాణ మండపం ప్రస్తుతం ప్రాధన్యం లేనందున దాని స్థానంలో ఆదాయాన్ని పెంపొందించే విధంగా కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. రాజన్న ఆలయానికి సంబంధించిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి ఆదాయాన్ని పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా సమ్మక్క, సారలమ్మ జాతరతోపాటు మహాశివరాత్రి జాతరకు భక్తులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేష్, ఏఈవోలు జయకుమారి, ప్రతాప నవీన్, హరికిషన్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, డీఈ రఘునందన్ ఉన్నారు.

నరసింహుడి సన్నిధిలో దేవాదాయశాఖ కమిషనర్ పూజలు

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ వి అనిల్‌కుమార్ కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. వేద పండితులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి దర్శనం చేసుకున్నారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించారు. అనుబంధ ఆలయాలు, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. ఆయన వెంట ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రినోవేషన్ కమిటీ సభ్యులు ఇనుగంటి రమా వేంకటేశ్వర్‌రావు, అక్కెనపెల్లి సురేందర్, అర్చకులు నంబి నరసింహమూర్తి, అశ్విన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కొండగట్టులో ..

మల్యాల: రాష్ట్ర దేవాదాయ కమిషనర్ వి అనిల్‌కుమార్ శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకు న్నారు. కుటుంబ సమేతంగా ఆలయంకు వచ్చిన కమిష నర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో వెంకటేష్ సత్కరించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీ మారుతీస్వామి, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్ ఆలయ అధికా రులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పాలక మండలి సమావేశాలు నిర్వహించకపోవడం, అధికారుల బదిలీపై డైరెక్టర్లు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

నరసింహుని ఆలయంలో పెరిగిన రద్దీ

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినం కూడా తోడు కావటంతో అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో, రావి చెట్టు ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ భక్తులు ప్రదక్షిణాలు చేశారు. స్వామి వారలను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. స్వామి వారలను అందంగా పూలతో అలంకరణ చేశారు.

అంతకు ముందు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాల శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు. ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్యా, నరసింహమూర్తి, అర్చకులు వంశీకృష్ణ, విజయ్, మోహన్, కిరణ్, సంతోష్, ప్రదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక దందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మెట్‌పల్లి మండలం ఆత్మనగర్‌లో, గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో ఇసుక డంపులను పరిశీలిస్తున్న పోలీసులు

గన్నేరువరం, జనవరి 13, అక్రమంగా ఇసుక దందాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తిమ్మాపూర్ రూరల్ సీఐ స్వామి హెచ్చరించారు. శనివారం మండలంలోని గుండ్లపల్లి శివారులో ఇసుక డంపులపై ఎస్ఐ చందా నరసింహారావుతో కలిసి దాడులు నిర్వహించారు. సుమారు 17 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుండ్లపల్లి శివారులో పలుచోట్ల అక్రమంగా ఇసుక డంపులను పోసి రాత్రి వేళలో సిద్దిపేట, హైదరాబాద్‌కు తరలిస్తున్నారని స్థానికులు అందించిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుక డంపులను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుంటామని హెచ్చరించారు.

మెట్‌పల్లి రూరల్: అక్రమంగా ఇసుకను నిల్వ చేసినా, తరలించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. శనివారం మండలంలోని ఆత్మనగర్ గ్రామ శివారులో ఎలాంటి అనుమంతులు లేకుండా అక్రమంగా ఇసుకను నిల్వ చేసినట్లు సమచారం అందగా ఆర్ఐ ఉమేశ్‌తో కలిసి దాడులు నిర్వహించి డంపులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా నిల్వ చేసిన డంపుల్లో ఇసుక సుమారు 10 ట్రాక్టర్ల కంటే ఎక్కువ ఉండవొచ్చని అంచనా వేశారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మొరం తరలించినా, నిల్వచేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరద కాలువకు నీటి విడుదల


ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువకు శనివారం అధికారులు నీటిని విడుదల చేశారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరద కాలువకు మూడు వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఎస్సారెస్పీ అధికారులు ప్రకటించారు. చేపలు పట్టేవారు, పశువుల కాపర్లు, రైతులు, సాధారణ ప్రజలు వరద కాలువ వద్ద అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇదిలాఉండగా ఎస్సారెస్పీ ప్రాజెక్టు సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 63.185 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 72.908 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు నుంచి 8,149 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 6 వేల క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 250 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కు లు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూ సెక్కులు, మిషన్ భగీరథ పథకాలకు 152 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను అధికారులు ప్రొజెక్టర్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఉప సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ రజిత, వైద్యాధికారి స్రవంతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కళావతి, కార్యదర్శి రవి, ఏఈవో ముకుంద్, వార్డు సభ్యులు సుధాకర్ రెడ్డి, లత, రాజేశ్వరి పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి



క్రీడాకారులతో నాయకులు

చందుర్తి, జనవరి 13 : యువత క్రీడా స్ఫూర్తిని చాటాలని బీఆర్ఎస్ నేత ఈర్లపల్లి రాజు అన్నారు. చందుర్తి మండలం మల్యాలలో వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కేసీఆర్ కప్ వాలీబాల్ టోర్నీని నిర్వహిస్తున్నందున గ్రామంలోని క్రీడాకారులకు శనివారం క్రీడా వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16, 17 తేదీల్లో రెండు రోజులపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచ్ గట్టు లక్ష్మీనారాయణ, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జనవరి 13 : సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ముద్రించిన - 2024 టేబుల్ క్యాలెండర్‌ను ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు బలరాం, ప్రధాన కార్యదర్శి చౌకి సుధాకర్, మండల అధ్యక్షుడు టీవీ లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి జోగినిపల్లి మోహన్‌రావు, మండల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు బి.బాలు, గౌరవ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య వైద్య శివప్రసాద్, నాయిని కిషన్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి

ఇల్లంతకుంట, జనవరి 13: బీజేపీ ఇల్లంతకుంట మండల అధ్యక్షుడిగా కొత్త శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పేర్కొన్నారు. నర్సక్కపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి గతంలో మండల అధ్య క్షుడిగా, ప్రస్తుతం జిల్లా అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ఇల్లంతకుంట, జనవరి 13: మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యల కరపత్రాన్ని మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనం ఎదుట శనివారం జిల్లా కన్వీనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 4న నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవికారి రాజవ్వ, జుబేదా, కనుకవ్వ, సుగణ, సంతోష, ప్రమోద, ఉన్నిసబేగం తదితరులు పాల్గొన్నారు.

రాజన్నపేటలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం శీతాకాల శిబిరంలో భాగంగా శ్రమదానం చేశారు. గ్రామంలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక స్పృహ కల్గించేలా ప్రత్యేక శిబిరం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 19 వరకు గ్రామంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. సర్పంచ్ శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి పర్శరాములు, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడిగా రాధాకిషన్

ఇల్లంతకుంట, జనవరి 13: స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడిగా అనంతగిరి గ్రామానికి చెందిన వెగ్గళం రాధాకిషన్ ఎన్నికయ్యారు. మండలకేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా ఎర్రోజు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా వెగ్గళం బాలనాగాచారి, ఉపాధ్యక్షులుగా అనుపురం చిరంజీవి, వెంకటేష్, పరిపూర్ణాచారి, కోశాధికారిగా శంకర్, గౌరవ సలహాదారులుగా శ్రీనివాస్, ఎర్రోజు రవీంద్రచారి, సత్యనారాయణ, కలికోట రవీంద్రచారి తదితరులను ఎన్నుకున్నారు.

అక్రమ కనెక్షన్లతో అధిక లోడు

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: గ్రామాల్లో కొందరు వ్యక్తులు విద్యుత్‌ను అక్రమంగా వాడడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడు పడి కాలిపోతున్నాయని, సంస్థకు సహకరించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు శనివారం ప్రకటనలో కోరారు. సెస్ పరిధిలోని అన్ని మండలాల్లో రైతులు, ప్రజలు అనుమతి లేకుండా కరెంటు తీగలకు కొక్కాలు తగిలించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అనధికార కనెక్షన్లతో అధిక లోడుతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని తెలిపారు. స్వచ్ఛందంగా తొలగించుకుని కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కన్నుల పండువగా గోదాదేవి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



స్వామివారల ఉత్సవమూర్తులు

సిరిసిల్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసంలో భాగంగా సిరిసిల్లలోని విద్యానగర్ భక్తాంజనేయ దేవాలయంలో నిర్వహించిన గోదారంగనాథ స్వామి కల్యాణం శనివారం కన్నుల పండువగా సాగింది. అంతకుముందు స్వామివారి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు వడ్డెపల్లి రమేష్, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, మాజీ దేవస్థానం అధ్యక్షుడు మామిడాల కృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దూస భూమయ్య, లయన్స్ క్లబ్ ప్రతినిధి సంజీవరావు, గోశిక శ్రీనివాస్, దూస ఈశ్వరి, బండారి నరేందర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో గోదాదేవి-రంగనాయకుల కల్యాణాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలమల్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ చిట్నేని సరితశ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు తీసుకొచ్చారు. వేంకటేశ్వర ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య గోదాదేవి రంగానాయకుల కల్యాణాన్ని శోభాయమానంగా నిర్వహించారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ అంజనేయరావు, ఎంపీటీసీ బొప్ప శ్రీధర్, ఉపసర్పంచ్ చాడ శ్రీనివాస్, తాండ్ర గిరి, కుంట రవి, జిల్లెల్ల మల్లేశం, లింగంపెల్లి ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని సీతారామాలయంలో గోదాదేవి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

చందుర్తి : మండలంలోని బండపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదారంగనాథులస్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న సర్పంచ్



గంభీరావుపేట రామాలయంలో గోదాదేవి కల్యాణం



బండపల్లిలో గోదారంగనాథుల కల్యాణం

ఆసాములపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 13 : శబ్ద కాలుష్యం పేరుతో మరమగ్గాలను ఇళ్లలో నుంచి తొలగించాలని ఆసాములపై పెట్టిన కేసులను అధికారులు వెంటనే ఎత్తి వేయాలని, మరమగ్గాల ఆసాములు, కార్మికులకు ఉపాధిని దెబ్బతీసే చర్యలు తీసుకోవద్దని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్‌లో శనివారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పర్యటించారు. అధికారలు కేసులు పెట్టిన ముగ్గురు ఆసాములను కలిశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల అంటేనే పవర్‌లూం వస్త్ర పరిశ్రమలకు నిలయంగా పేరుగాంచిందన్నారు. ఇక్కడ ప్రతీ ఏరియాలో దాదాపు 80 శాతం ఇళ్లలో మరమగ్గాలు ఉంటాయని, వాటిపైనే అధారపడి జీవన ఉపాధిని పొందుతున్నారని అన్నారు. వడ్డెపల్లి మురళి, బోడ గంగాధర్, కట్కూరి దేవేందర్ అనే ఆసాములు జీవనోపాధి పొందుతున్నారని, శబ్దకాలుష్య నియంత్రణ అధికారులు ఇక్కడి వస్త్ర పరిశ్రమ పరిస్థితులను గమనించక పోవడం బాధాకరమని అన్నారు. వడ్డెపల్లి లక్ష్మణ్ తన స్వార్థ ప్రయోజనాల కోసం ఇచ్చిన ఫిర్యాదుతో ఆసాములుపై కేసులు పెట్టారని ఆరోపించారు. కేసులను ఎత్తివేయని పక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌నగర్ సీపీఎం శాఖ కార్యదర్శి బండి శ్రీనివాస్, నాయకులు వీరబత్తిని రవి తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌నగర్‌లో మాట్లాడుతున్న మూషం రమేష్

నలుగురు దళారులపై చీటింగ్ కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 13: రెండు ఎకరాల భూమి సెటిల్‌మెంట్ చేస్తామని చెప్పి మిగతా 12 గుంటల భూమిని లాక్కున్న నలుగురిపై చీటింగ్ కేసు నమోదైంది. సిరిసిల్ల పట్టణ శివారులోని చంద్రంపేట బైపాస్ రహదారి సమీపంలో గుడ్ల వెంకటేశంకు వంశపారంపర్యంగా వచ్చిన రెండెకరాల 12 గుంటల స్థలం ఉంది. ఇందులో రెండెకరాల స్థలం ధరణిలో నమోదు కాలేదు. ఈ భూ సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన వ్యక్తులు 2017లో అతడి పేరిట ఉన్న మిగతా 12 గుంటల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రెండెకరాల భూమి ధరణిలో నమోదు విష యమై అనేకసార్లు వారిని ప్రశ్నించాడు. రూ.కోటి ఇస్తే భూమి రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పి బుకాయించారు. దీంతో బాధితుడు అప్పటి ప్రజా ప్రతి నిధులను ఆశ్రయించాడు. న్యాయం చేస్తామని చెప్పినా హామీ నెరవేరలేదు. తన భూమి లాక్కున్న దళారులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఈ నెల 10న బాధితుడు వెంకటేశం పోలీసులను ఆశ్రయించాడు. మోసం చేసిన నలుగురిపై చీటింగ్ కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అమృత్‌లాల్ శుక్లా వర్ధంతిని విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, జనవరి 13 : మాజీ ఎమ్మెల్యే అమృత్‌లాల్ శుక్లా 33వ వర్ధంతి సభను ఆదివారం జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట వీరుడు తెలంగాణ సాయుధ పోరాట యోధులు సిరిసిల్ల తొలి ఎమ్మెల్యే అమృత్‌లాల్ శుక్లా వర్ధంతి సభను తంగళ్లపల్లి మండలం మానేరు నది ఒడ్డున ఉన్న స్తూపం వద్ద ఆదివారం జరిగే సభకు సీపీఎం, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటి సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, నాయకులు ఎలిగేటి రాజశేఖర్, కందుకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ మూసివేతపై కేటీఆర్ సమాధానం చెప్పాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న మృత్యుంజయం

సిరిసిల్ల టౌన్, జనవరి 13 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను అన్ని రకాలుగా ఆదుకున్నామని గొప్పలు చెప్పిన కేటీఆర్ టెక్స్‌టైల్ ఎందుకు మూతపడిందో సమాధానం చెప్పాలని టీపీసీసీ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకురావడం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికీ అధికారంలో ఉన్నామన్న భ్రమలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలోనే ఆరాచకాలు, ఇసుక, లాండ్ మాఫీయా, దోపిడీలు జరిగాయని ఆరోపించారు. ఒక్కనెలలో దాదాపు రూ. 140 కోట్ల విలువ చేసే ఇసుకను అక్రమంగా జిల్లా నుంచి తరలించారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఏటీఎంలా ఉపయోగించుకున్నారన్నారు. దీనిపై విచారణ జరపడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధమయ్యారన్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా స్టోన్‌క్రషర్లు నడుస్తున్నాయన్నారు. అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అఫ్జాద్, నాయకులు వైద్య శివప్రసాద్, మేకల కమలాకర్, వనితగౌడ్, కంసాల మల్లేశం, అశోక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక తరలింపును పట్టించుకోని అధికారులు

సిరిసిల్ల టౌన్, జనవరి 13 : సిరిసిల్ల పట్టణంలోని మానేరు వాగు ఇసుకను వే బిల్లులు లేకుండా బొల్లి బ్రదర్స్‌కు సంబంధించిన ట్రాక్టర్లలో తరలిస్తుంటే వారు ఇస్తున్న లంచాలను అధికారులు జీతాలుగా తీసుకుంటూ వదిలేస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అఖిల పక్షం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యానగర్ మానేరు బ్రిడ్జి, ఎస్పీ కార్యాలయం వెనకాల మానేరు వాగులో నుంచి అనేక సంవత్సరాలుగా బొల్లి బ్రదర్స్ ఇసుకను అక్రమంగా తీస్తున్నారని, పోలీసులకు, మైనింగ్, రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. మానేరు వాగులో నుంచి రాత్రింబవళ్లు వేలాది ట్రిప్పుల ఇసుకను వే బిల్లులు లేకుండా జేపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన వారే ఇసుక అక్రమ రవాణకు పాల్పడుతున్నారన్నారు. వారికి సంబంధించిన ట్రాక్టర్లకు వే బిల్లులే ఉండవని, ఉపాధి కోసం ట్రాక్టర్లను కొనుకున్న వారు వే బిల్లులతో ఇసుకను స్థానిక గృహ అవసరాలకు తీస్తే మాత్రం అధికారులు వెంట పడి కేసులు పెడుతున్నారని అన్నారు. మానేరు వాగులో రాత్రి 11 గంటలకు అక్రమంగా ఇసుకను తరలించడం మొదలైతే ఉదయం 6 గంటల వరకు కొనసాగుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బొల్లి బ్రదర్స్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల మున్సిపల్ 26వ వార్డు కౌన్సిలర్ కరోనాతో చనిపోతే ఎందుకు ఎన్నికల నిర్వహించలేదని ప్రశ్నించారు. దళితుల వార్డు కాబట్టే ఎన్నికలను కేటీఆర్ నిర్వహించలేదన్నారు. దళితులపై కేటీఆర్‌కు ఎంత ప్రేమనో అర్థమౌవుతోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కాంగ్రెస్ ఎస్సీ సెల జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, ఎస్సీ సబ్‌ప్లాన్ జిల్లా అధ్యక్షుడు కంసాల మల్లేశం, నాయకులు దుమాల నర్సయ్య, విజయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

భగత్‌నగర్, జనవరి 13: కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని, ఈ నెల 19న జరిగే సీఐటీయూ, రైతువ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సదస్సును సయప్రదం చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం నగరంలోని కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై ఇంటింటికీ అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా సదస్సును కార్మిక, కర్షకులు విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభు త్వం పది సంవత్సరాల కాలంలో కార్పొరేట్ కంపెనీలకు మాత్రమే పనిచేసిం దన్నారు. సంపదను సృష్టిస్తున్న కార్మిక, కర్షకులకు తీవ్రమైన మోసపూరిత చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఈ నెల 19వ తేదీన కార్మిక కర్షక మైత్రి దినోత్సవం సందర్భంగా జిల్లా సదస్సు నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు నిరం తర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వాసుదేవరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు



పెద్దలింగాపూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



రుద్రంగిలో..

ఇల్లంతకుంట, జనవరి 13: మండలంలోని పెద్దలింగాపూర్‌లో అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర శనివారం కొనసాగింది. గ్రామంలోని ఆలయం నుంచి ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

ముస్తాబాద్: మండలంలోని మద్దికుంట గ్రామంలో ఇంటింటికి అయెధ్య రాముడి అక్షింతలను శనివారం పంపిణీ చేశారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, సర్పంచ్ జనగామ భాగ్యశ్రీ ఆధ్వర్యంలో గ్రామస్థులు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికి అందించారు. గ్రామస్థులు రమేశ శంకర్, జింక ఎల్లం, వెంకటేశ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలో అయోధ్య రామమందిరం నుంచి తీసుకొచ్చిన రాముడి అక్షింతలను గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి శనివారం ఇంటింటా పంపిణీ చేశారు. జడ్పీటీసీ గట్ల మీనయ్య, మంచె రమేష్, అల్లూరి అశోక్‌రెడ్డి, రవీందర్, కోటగిరి శ్రీనివాస్ మాడిశెట్టి అభిలాష్, ఆనంధం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు





ముగ్గులను పరిశీలిస్తున్న మహిళలు, బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. పోటీల్లో ప్రథమ విజేత చిదుర మాధవి, ద్వితీయ శ్రీపతి లావణ్య, తృతీయ బి.శారదకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, డాక్టర్ లీలా శిరీష, డాక్టర్ శోభారాణి బహుమతులను ప్రదానం చేశారు. శ్రీనగర్ కాలనీ అసోసియేన్‌అధ్యక్షుడు భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, సంయుక్త కార్యదర్శి ప్రభుస్వామి, కోశాధికారి దేవేందర్, నవీన్, రామారావు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలను తెలుగు విభాగం, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సౌజన్యంతో నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి బహుమతులను అందజేశారు. తెలుగు విభాగం అధ్యాపకులు పిట్ల దాసు, ఉమారాణి, ఉమెన్స్ ఎంపవర్మెట్ సెల్ కన్వీనర్ వాణి పాల్గొన్నారు.



ముగ్గును పరిశీలిస్తున్న సభ్యులు